క్లుప్తంగా

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం లో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకు న్నారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమతో అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

నేడు బంగారమ్మపాలెంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

సబ్బవరం: బంగారమ్మపాలెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభిస్తారన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు స్పెషలిస్టు వైద్య సేవలు,కంటి సంబంధిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి ఈత పోటీలకు తేజ



పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 9 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఈత పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన రెడ్డి తేజ ఎంపికయ్యాడని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు చెప్పారు. తిరుపతిలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన పోటీల్లో 200 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో బంగారు పతకం, 400 మీటర్ల వ్యక్తిగత మిడ్లీలో వెండి పతకం, 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో కాంస్య పతకాలు సాధించాడు. జాతీయ స్థాయి ఈత పోటీలకు ఎంపికైన విద్యార్థి రెడ్డి తేజను పాఠశాల ప్రిన్స్‌పాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, కోచ్ హరినాథ్‌రెడ్డి అభినందించారు.

ఇసుక లారీ పట్టివేత



పరవాడ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిపోతుందని అందిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు ఇసుకతో ఉన్న లారీని సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను పరవాడలో నిల్వ చేసి అధిక రేట్లకు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారని పరవాడకు చెందిన పలువురు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ గఫూర్ పరవాడ సినిమాహాలు కూడలిలో రాజమండ్రి నుంచి వచ్చిన ఇసుక లారీని పట్టుకున్నారు. లారీలో ఇసుకకు సంబంధించిన బిల్లులను రాజమండ్రిలోని రీచ్‌కు పంపామని సదరు బిల్లులు అక్రమమా లేక సక్రమమా అనేది మంగళవారం నాటికి పూర్తి క్లారిటీ వస్తుందని డీటీ గఫూర్ చెప్పారు.

కొత్త సీజీఎంకు అభినందన



నూతన సీజీఎం సోఫ్టీకి అభినందనలు తెలుపుతున్న సిటూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ విభాగం నూతన సీజీఎం ఎ.కె. సోఫ్టీకి స్టీల్ సీఐటీయూ నాయకులు అభినందనలు తెలిపారు. సీజీఎం వర్క్స్‌గా విధులు నిర్వహించిన ఎస్.వి.స్వామి ఆదివారం పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో సోఫ్టీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షుడు వై.టి.దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భరోసా

- విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో చేరువైన వైద్యం
- తీరిన రోగుల కష్టాలు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు





అంతకాపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్



బాటజంగాలపాలెం క్లినిక్‌లో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గొటివాడలో అందుబాటులోకి వచ్చిన విలేజ్ హెల్త్ క్లినిక్

సబ్బవరం: సచివాలయాల పరిధిలో అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు చేరువలో ప్రాథమిక వైద్యం అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టింది. వైద్య సేవలకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించే విధంగా అడుగులు వేసింది. గ్రామ సచివాలయాలకు అనుసంధానం చేస్తూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. వీటిలో ఎంఎల్‌హెచ్‌పీ(మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్‌)తో పాటు ఏఎన్ఎం,ఆశా తదితర వైద్య సిబ్బంది క్లినిక్‌లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించనున్నారు.

అందించే సేవలు ఇవే..

- విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ప్రతిరోజు గర్భిణులకు వైద్య పరీక్షలు,టీకాలు,టెస్టులు నిర్వహిస్తారు.
- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందిస్తారు.
- చిన్నారులకు అవసరమైన అన్ని రకాల టీకాలు సకాలంలో వేస్తారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎత్తు తక్కువ, బరువు తక్కువ ఉన్న చిన్నారులకు తగు సూచనలు చేసి పౌష్టికాహారం అందించే విధానంపై అవగాహన కల్పిస్తారు.
- కౌమార దశ పిల్లల్లో అధికంగా వచ్చే రక్తహీనతను గుర్తించి తగిన సూచనలు చేయడం,వైద్య సేవలు అందించడం చేస్తారు.
- సచివాలయం పరిధిలోని గ్రామాల్లో వాటర్ శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించి రక్షిత మంచి నీటిని అందించే విధంగా కృషి చేస్తారు.
- ఈ సంజీవిని ద్వారా స్పెషలిస్ట్ వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటారు.

రూ.17.50 లక్షలతో ఒక్కో క్లినిక్ నిర్మాణం

మండలంలోని సబ్బవరం,గుల్లేపల్లి పీహెచ్‌సీల పరిధిలో గొటివాడ,బాట జంగాలపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పూర్తయ్యాయి. వైద్య సేవలు అందిస్తున్నాయి. ఒక్కో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 17.50 లక్షల చొప్పున కేటాయించింది.

- పెదగొల్లలపాలెం,అడ్డూరు,అమృతపురం,అంతకాపల్లి,వంగలి గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.
- ఆరిపాక,ఆసకపల్లి, పైడివాడ అగ్రహారం,నారపాడు,బంగారమ్మపాలెం,దుద్దుపాలెం,తవ్వవానిపాలెం, మొగలిపురం,బోదువలస గ్రామాల్లో నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.



వంగలిలో తుదిదశకు చేరుకున్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

గ్రామంలోనే వైద్య సేవలు



గ్రామంలోనే అన్ని రకాల ప్రాథమిక వైద్య సేవలు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా అందుతున్నాయి. గతంలో సబ్బవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకునేవారం.ప్రస్తుతం గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ధీమాగా ఉంది.వృద్ధులకు సౌకర్యంగా ఉంది.

–గొలజాన దుర్గాప్రసాద్, గొటివాడ

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి ప్రజల చెంతకే వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా అన్ని రకాల వైద్య సేవలు గ్రామంలో అందుబాటులోకి తెచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– లగిశెట్టి కుమార్, బొండవానిపాలెం

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీత ధారణ చేస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అదిష్టింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు ఈపూజ నిర్వహించారు. 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. తులసి ప్రసాదం భక్తులకు అందజేశారు.

అడవివరం కోఆపరేటివ్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ



సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ 2024 క్యాలెండర్‌ను సోమవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. క్యాలెండర్‌లను సొసైటీ సభ్యులందరికీ అందిస్తామని సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. కార్యక్రమంలో కొలుసు గురునాథ్, మజ్జి ధర్మా, గేదెల మురళీకృష్ణ, పాలూరు సూరిబాబు, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, మాజీ వార్డు అధ్యక్షుడు పీతల అప్పలరాజు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పెందుర్తి: రాంపురంలోని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు ఉదయం నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకుల సమక్షంలో అదీప్‌రాజ్ కేక్ కట్ చేశారు. పెందుర్తి, పరవాడ, సబ్బవరం, వేపగుంట తదితర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

పరవాడ: అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతిని ఆమె నివాసంలో కలిసి వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు తదితరులు ఉన్నారు.

ఎన్టీపీసీలో..

సింహాద్రి ఎన్టీపీసీలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా కేక్ కట్ చేశారు. నూతన సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త ఆనందాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. అంతక ముందు సావ్యస్ భవనంలో నూతనంగా పునరుద్ధరించిన సమ్మద్ హాలును ఆయన ప్రారంభించారు. వేడుకల్లో చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.గోవిందరాజన్, ఉన్నతాధికారులు ఎన్ గడ్డం, డి.పి.పాత్రో, బి.బి. పాత్ర, సీనియర్ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎంపీ సత్యవతికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు



కేక్ కట్ చేస్తున్న ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ ఎస్.కె.సిన్హా, అధికారులు

వెంకన్నకు నవనీత సేవ



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



నవనీత అలంకరణలో వెంకన్న

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం తిరుప్పావై సేవా కాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్వామివారికి నవనీత సేవ ఘనంగా నిర్వహించారు. వేకువజామున తిరుప్పావై పారాయణం, సుప్రభాత సేవ, విశేష పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం 27 కిలోల వెన్నతో స్వామిని అలంకరించారు. ఆలయ ప్రధాన పురోహితుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో విశేష అర్చనలు జరిపారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న వెంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల షెడ్యూల్ ఖరారు

సబ్బవరం: ప్రభుత్వం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహించే వైద్య శిబిరాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. రెండో విడత శిబిరాలు మంగళవారం మొదలై మే7 వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. దీనిలో భాగంగా మంగళవారం బంగారమ్మపాలెంలోని ఎంపీపీ స్కూల్ ఆవరణలో శిబిరం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ నెల 9న అమృతపురం గ్రామ సచివాలయం ఆవరణలో,23న మల్లునాయుడుపాలెం గ్రామ సచివాలయం ఆవరణలో.. 30న సబ్బవరం సచివాలయం-4 పరిధిలో వారికి ఎంపీపీ స్కూల్ ఆవరణలో శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా 19వ రోజు సోమవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్ర నామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన జరిపారు. అమ్మవారికి క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

సమష్టి కృషితోనే స్టీల్‌ప్లాంట్ టర్న్ అరౌండ్

సీఎండీ అతుల్‌భట్

ఉక్కునగరం: ఉద్యోగుల సమష్టి కృషితో స్టీల్‌ప్లాంట్ టర్న్ అరౌండ్‌సాధ్యమని సీఎండీ అతుల్ భట్ ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సోమవారం ఉక్కు మల్టీపర్పస్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సంక్షోభం నుంచి బయటపడేందుకు ఉద్యోగులు, కార్మిక సంఘాలతో పాటు ఇతర వ్యాపార సహచరులు మద్దతు ఇవ్వాలని కోరారు. టర్న్ అరౌండ్‌ప్లాన్ పంచుకుంటూ సాంకేతిక అడ్డంకులు, ఆర్థిక సమస్యలు, వర్కింగ్ క్యాపిటల్ సమస్యలు, రుణ తగ్గింపు వ్యూహాలు, ముడి సరుకుల అనుసంధానాన్ని నిర్ధారించడం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ డైరెక్టర్లతో ఇంటర్నల్ సంచిక ఉక్కువాణి, ఫీల్డ్ బుక్, వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్లాంట్ మార్కెటింగ్, ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎస్.సి.పాండే, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ఎ.ఎం.హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

శ్రీవారి ఆలయంలో పుష్పయాగం



పుష్పరాశి నడుమ శ్రీనివాసుడు



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిగా నాట్యకళాకారులు

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడా కాలనీ మామిడి తోటలో కొలువుదీరిన పద్మావతి ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేస్వార స్వామి ఆలయంలో సోమవారం పుష్పయాగం చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పుష్పయాగం చేశారు. కోలాటం, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శ్రీసాయి నాట్య భారతి అకాడమీ ప్రతినిధి శిరీషారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెదసంఖ్యలో భక్తులు ఈ యాగంలో పాల్గొన్నారు.

హెల్త్ ఉద్యోగుల క్యాలెండర్లు, డైరీ ఆవిష్కరణ

మహారాణిపేట: ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) జేఏసీ ఆధ్వర్యంలో క్యాలెండర్లు, డైరీ సోమవారం ఆవిష్కరించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు శశిభూషణరావు, ప్రధాన కార్యదర్శి వీరబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీహెచ్ నాగరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

గాజువాక: ఈ నెల 3 నుంచి 6 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు గాజువాక ప్రాంతానికి చెందిన 20 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వారు సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు అభినందించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 150 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని, వారిలో 20 మంది గాజువాకకు చెందినవారు ఉండటం అభినందనీయమని పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నూకరాజు, ప్రతినిధులు ప్రేమ్ కుమార్, వెంకట్, ఆనంద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో 'ఉక్కు' పరిరక్షణ



1054వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా విజయం సాధించగలమని నాయకులు పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1054వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగించేందుకు ఉక్కు కార్మిక వర్గం ప్రజలను చైతన్య పరిచి ఉద్యమం వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.